# శుభలేఖ

ఆదెమ్మ గేదెకోసం పచ్చగడ్డి తీసుకొని వస్తున్నది. రోడ్డుమీద లక్ష్మీపతి, గౌరీపతి ఎదురెదురుగా నడుస్తున్నారు. వాళ్ళిద్దరూ ఒక పాయింటు దగ్గర చేరేసరికి బుడుగు అమాంతంగా ఆదెమ్మ నెత్తిమీదకట్ట లోని నాలుగు పచ్చగడ్డి పరకలు లాగేడు. పచ్చగడ్డిమోపు బేలన్సు తప్పి నేలమీద పడింది. బుడుగు ఆ నాలుగు పరకలూ వాళ్ళిద్దరి నడుమా పడేశాడు. అవి భగ్గున మండాయి.

"నీ జిమ్మడ!" అని తిడుతూ ఆదెమ్మ బుడుగు వంక చూసింది. బుడుగు ఆ మంటలో చలికాచుకుంటున్నాడు. ఆదెమ్మ ఇంకా తిట్టబోయి, అంతలోనే ఆశ్చర్యపడి మానుకుంది. మంట చూస్తే చలి జ్ఞాపకం వచ్చింది. మోపులోని గడ్డి తీసి మంటలో మరో ఇంత వేసింది. ఆశ్చర్యం. అది అంటుకోలేదు. మండుతున్న మంట ఆరిపోయింది.

"పచ్చగడ్డి మండదు" అన్నాడు బుడుగు.

"వోరి పిడుగా! ఆ సంగతి నాకు చెప్పాలా? మరి ఇంతక్రితం ఈ మోపులో గడ్డేగా మండింది. ఎంత చిత్రం!" అంది మధ్యకు పగలగొట్టిన కొబ్బరికాయలా మూతిపెట్టి.

"అదా! దానికో కథ ఉంది" అన్నాడు.

అని ఆదెమ్మ అడగకుండానే "అటు చూడు ఆ లైటుస్తంభం దగ్గరగా ఉన్నతను గౌరీపతి, ఆ ఇటుచూడు – ఆ సోడాకొట్టు పక్కగా ఉన్నది లక్ష్మీపతి. వాళ్ళిద్దరి మధ్య వేస్తేనే పచ్చగడ్డి మండు తుంది" అన్నాడు ఒక కొత్త విజ్ఞానాన్ని ఆవిష్కరించిన సైంటిస్టులా.

అక్కడ ఉన్నది రైల్వే కాలనీ. అందులో, ఉంటున్నారు ఇద్దరు 'పతులూ'. ఇద్దరూ రైల్వే ఉద్యోగులే. ఒకరు తూర్పు అయితే ఒకరు పడమర. ఒకరిది పగలు డ్యూటీ, వేరొకరిది రాత్రి డ్యూటీ. విచిత్రమేమిటంటే ఇద్దరూ ఒకే కాలనీలో ఒకే బ్లాకులో ఉంటున్నారు. గౌరీపతి లక్ష్మీపతిని, లక్ష్మీపతి గౌరీపతిని తిట్టని, తూలనాడని దినమే ఉండదు. ఇద్దరూ కలిశారంటే మహా ప్రళయం సంభవిస్తుందంటే ఆశ్చర్యంలేదు. వారి మధ్య ఇంత వైరం ఉన్నా వారి గృహిణులు కలసిమెలసి అక్కాచెల్లెళ్ళలా మెలుగుతారు.

ఆదెమ్మ ఆ కాలనీకి దగ్గరలోనే అనధికృతంగా వెలసిన జనతా కాలనీలో స్వంత గుడిసెలో ఉంటున్నది. ఆదెమ్మకు మొగుడున్నాడో లేదో తెలియదు. నిత్యపునిస్త్రీలా రంగుకోకలే కడుతుంది. ముఖాన కాణీ అంతటి ఎర్రటిబొట్టు పెట్టుకుంటుంది. పెళ్ళాంతో వేగలేక దాని మొగుడు సన్యాసుల్లో

కలిసిపోయాడనీ కొందరంటారు! అబ్బే! అదేంకాదు. భార్య బాధ పడలేక మిలట్రీలో చేరి బంగ్లాదేశ్ యుద్ధంలో చచ్చిపోయాడంటారు మరికొందరు. ఎవరి వాదం సరియైనది అని యోచించే కంటే ఆదెమ్మ స్వభావం ఎలాంటిది అనే విషయం ఆలోచించాలి.మొత్తానికి ఆదెమ్మ నోరు దురుసు. ఆమె ఏ చీకూ చింతా లేకుండా పదేళ్ళ కొడుకుని కనిపెట్టుకుని పాలూ-నీళ్ళూ అమ్ముకొని బ్రతుకుతున్నది.

రోడ్డు పక్క కుళాయిలో ఇరవై నాలుగు గంటలూ నీళ్ళు రావు. ఉదయం ఒక గంటన్నర, సాయంత్రం ఒక గంటా వస్తాయి. ఆదెమ్మ నీళ్ళకోసం వస్తే అందరూ తమ తమ బిందెలు, కడవలు పక్కకు తోసి ఆమెకు స్వాగతం చెప్తూ తప్పుకుంటారు. అలా కానినాడు యుద్ధం జరగాల్సిందే. ఒక పర్యాయం అలాంటి సన్నివేశం చూసే భాగ్యం కొందరికి దక్కింది.

ఆదెమ్మ జుత్తు ముడివిప్పి, చీరచెంగు బొడ్లో దోపుకుని, ఏడు తరాల వారిని తిడుతూ మదించిన గున్నఏనుగులా స్వైర విహారం చేసింది. కడవలు యుద్ధంలో చచ్చిపోయిన పీనుగులైనవారి కళేబరాల్లా దొర్లాయి. బిందెలు సొట్టలు పడి అహుతులైన సైనికుల మల్లే బావురుమన్నాయి. కొళాయి నీరు పారి ఏరైంది.

నోరున్న వారిదే రాజ్యం - అని ఆనాడు మరో మారు ఋజువైంది. ఆమె నోటికి భయపడకుండా ఉండడం చివరకు ఆమెను సృష్టించిన బ్రహ్మదేవుడికి కూడా సాధ్యంకాదు. ఏడ్చి ఏడ్చి మరి వోపికలేనట్లు కుళాయి నీరు కార్చడం మానేసింది.

ఆదెమ్మ పాలూ నీళ్ళే కాకుండా పేడా పిడకలూ కూడా అమ్ముకునేది.

పిడకల వేటకు ముందు కుళాయిల గురించి కదూ చెప్తున్నాను, కాదు.. నీళ్ళ గురించి. అవునా?

నీటికి ఎద్దడి ఢిల్లీలో అన్నా ఉంటుందేమో! కాని ఆదెమ్మకు లేదు. లేదు అని ఘంటాపథంగా అనలేం. ఒక్కొక్కరోజు కుళాయిలు స్ట్రయికు చేస్తాయి. మిల్లు కార్మికులు మొదలుకొని పోలీసు సిబ్బంది వరకు స్ట్రయికు చేసే దేశంలో కుళాయిలు స్ట్రయికు చేయడంలో విడ్డూరంలేదు. అలా స్ట్రయికు జరిగి నీళ్ళు దొరకనినాడు ఆదెమ్మ దగ్గర వాడుకగా పాలు పోయించుకునేవారి ఇళ్ళలో టీ, కాఫీల స్ట్రయికు జరగవలసిందే.

పాలూ నీళ్ళకు అంత అవినాభావ సంబంధం ఉంది. పాల కావడి మోసే వారు రాళ్ళు కూడా మోయాలి. అందుకే పాలకోసం నీళ్ళు... నీళ్ళకోసం కొళాయిలు... కొళాయిల కోసం 'రాయి' మీరు వినాల్సిన ఖర్మ వచ్చింది.

"అదేమే! ఆదెమ్మా! నిన్న పాలు పోయలేదు" అని ఏ ఇల్లాలైనా అడుగుతే "ఏం చెయ్యనమ్మా! నిన్న కొళాయిలు రాలేదు" అంటుంది ఆదెమ్మ. కొళాయిలు రాలేదంటే కొళాయిల్లో నీళ్ళు రాలేదని అర్థం.

"ఏమిటి? నీళ్ళకూ పాలకూ ఏమి సంబంధం? చూశావా! మేం రోజూ పాలు నీళ్ళలా గుంటున్నాయి అంటే "రామ!రామ!" అంటావు. ఈనాడు నీవే ఒప్పుకున్నావు. నీళ్ళు దొరకనందున పాలు తేలేదని. అంటే ఏమిటే దానర్థం?" అని ఎవ్వరైనా ఎదురుప్రశ్న వేస్తారనుకోండి, ఆదెమ్మ నాలిక కొరుక్కోదు. అరే నోరుజారి నిజంచెప్పాను అనుకోదు.

ప్లేటు ఫిరాయిస్తుంది. "అదా! మీ అనుమానం బంగారంకానూ! కొళాయిలు రాకుంటే నీళ్ళు లేకుండా జరుగుతుందా? ఈ పాలకేమమ్మా. ఇలా పిండి అలా తెస్తాను. నిన్న నీళ్ళు తెచ్చుకునే సరికి సరిపోయింది" అంటుంది. అంతటితో వూరుకోదు. "అమ్మా! మంచి గడ్డపెరుగు తెచ్చాను. ఒక శేరు పోయమంటారా?" అంటుంది.

గడ్డపెరుగు మాట వినగానే నోరూరనిదెవరికి? "శేరెందుకే - ఒక అర్ధశేరు చాలు" అంటూ గిన్నె దాని ముందుకు తోస్తే పలచటి మజ్జిగ అందులో కొలుస్తుంది.

"గడ్డ పెరుగంటివిగా?" అని ఆ ఇల్లాలు దమ్మిడీ అంత ముఖం చేసుకుంటుంది. అప్పటికే ఆదెమ్మ గేటు దాటేస్తుంది

ఆదెమ్మ గేదెను పెంచడంలో ఒక విశేషత ఉంది. స్వయంగా పచ్చగడ్డి కోసుకొస్తుంది. ఈ అమ్మనూ ఆ అమ్మనూ బ్రతిమాలి మంచి చేసుకొని గంజినీళ్ళు అన్నం మెతుకులు పెసరుపొట్టు తీసుకొస్తుంది. తను పెట్టే ఆహారానికి పరిపూర్తి కొరకు రాత్రిళ్ళు గేదెను ఊరి మీదకు వదిలేస్తుంది.

కాలనీ వాళ్ళకు ఈ గేదె ఒక సమస్య అయింది. ఎంత దిట్టంగా గేటు బిగించినా అది నేర్పుగా తీసుకొని లోపలికొస్తుంది. అలా సాధ్యపడకపోతే దడినే పెకళించివేస్తుంది. కడుపారా పాదులూ మొక్కలు తినిపోతుంది. ఈవిధంగా దాని దాణాకు లోటుండదు. ఆదెమ్మ పొదుపుకు అడ్డూ ఉండదు. వూరివారి సొమ్ము తేరగా తిని బాగా బలిసిన గేదె దండిగానే పాలిచ్చేది.

రోజులన్నీ ఒక్కలా ఉండవు. నేడు సమృద్ధిగా పండిన పొలాలే అతివృష్టికో, అనావృష్టికో గురై మరో ఏడు బీడైపోతాయి. పాపం! గేదె శుష్కించి పోసాగింది. ఎలా సంభవించిందంటే.. కాలనీవాళ్ళు కళ్ళు తెరుచుకున్నారు. సమష్టిగా అర్జీ పెట్టుకున్నారు. కాంపౌండు గోడా, ఇనుపగేటూ ప్రతీ ఇంటికి కావాలని. రాజకీయ హస్తం ఉంటేనే కాని పనులు జరగవని. ఈ పనివలన తమ కెంత లాభం చేకూరుతుందో అధికారులు అంచనా వేసుకున్నారు. ఫరవాలేదు. పాతికవేలు దాకా గిట్టుబాటు ఉంటుందని తట్టిన తరువాత కాలనీ స్వరూపం మారిపోయింది.

స్వరూపం మారిపోయిన కాలనీ ఆదెమ్మకు సంకటమైంది. గేదె నోటి ముందు కూడును పడగొట్టిన ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. అంత డబ్బు ఖర్చు పెట్టి గోడలూ గేటులూ పెట్టడం అన్యాయమంది. ఎందరో తనలాంటి పేదవారు ఉండడానికి సరియైన గుడిసెలు లేక బాధపడుతూ ఉంటే ఈ ఇళ్ళకు ప్రహరీ గోడలు కావలసి వచ్చాయా? అంది. ఇంకా ఎన్నో అనేది అయితే తాను నాయకురాలు కాదు. ప్రతిపక్షం సభ్యురాలూ కాదు అని వూరకుంది.

నారుపోసినవాడు నీరు పోస్తాడంటారు. నీళ్ళు పోయగలిగిన ఆదెమ్మ దాణా పెట్టుకోలేక పోతున్నది. ఆ గేదె ఆమరణ దీక్షతో చచ్చిపోయేదే. కాని ఇంత విపత్తులోనూ గేదె తన ఆహార సమస్యకో పరిష్కారం కనుగొంది. రాత్రల్లా వెతకగా వెతకగా దానికి గౌరీపతి, లక్ష్మీపతుల కాంపౌండు కనిపించింది. గౌరీపతి పెరడు అకాలం సంప్రాప్తించిన భూముల్లా ఉన్నా, లక్ష్మీపతి పెరడు పచ్చగా మొక్కలతో కళకళలాడుతున్నది. లక్ష్మీపతి ఇంటిలో పూలమొక్కలున్నాయి. కాబట్టి గౌరీపతి ఇంటిలో ఉండవు. లక్ష్మీపతి ఇంటిలో కిచను గార్డెను ఉంది కాబట్టి గౌరీపతి ఇంటిలో ఉండదు. గేటు పడినా తాళం పడ్డానికి వీలులేదని గౌరీపతి హఠం వేసుకు కూర్చున్నాడు. ఆదెమ్మగేదె నా మొక్కలు

తినిపోతుందని లక్ష్మీపతి అన్నా గౌరీపతి వినిపించుకోలేదు. గేదెకాపూట కడుపారా తిండి దొరికింది.

జానెడుపొట్టకోసం మానవుడు సాటివాళ్ళను చంపుకుతింటున్నాడు. ఆ పొట్టే లేకుంటే ఏ మహాపురుషుడూ విశ్వశాంతికి సందేశాలు ఇవ్వవలసిన పనిలేదు. పిపీలికాది జీవరాశుల పొట్టలు అతి చిన్నవి. అందుకే ఆ జాతుల్లో మహాత్ములు లేరు. మూరెడు పొట్ట ఉన్న గేదె ఆకలికి తాళుకోలేక లక్ష్మీపతి పెరడు బీడుచేస్తే అది దాని తప్పా?

తిరిగి గౌరీపతి, లక్ష్మీపతుల మధ్య యుద్ధం, ఓటమి గెలుపుల ప్రసక్తి లేని యుద్ధం, భార్యామణులు కలుగజేసుకుంటే సీజుఫైరు.

గౌరీపతి తాళం వేయడానికి అంగీకరించాడు. ఆ తాళం ఆదెమ్మ గేదె పాలిట శత్రువైంది. తిండి లేకుంటే పాలేం ఇస్తుంది? పాలివ్వని గొడ్డు నేం చేసుకుంటుంది ఆదెమ్మ. ఆమె జీవకారుణ్య సమితి సభ్యురాలు కాదు.

ఏలాగూ ఇది వట్టిపోతున్న గొడ్డు. పూట పూటకు పాల పాలు తగ్గించేస్తున్నది. ఆమె దృష్టి మరో గేదెమీద పడింది. ఈ గొడ్డును వదిలించుకుంటే మరొకటి కొనవచ్చు.

గౌరీపతికి తన భార్య సుదీర్ఘ వ్యాధితో బాధ పడుతున్నదేమో నన్న అనుమానం వచ్చింది. అనుమానం రావడానికి కారణం ఆదెమ్మ పోసే నీళ్ళపాలు. కాఫీలో రుచి ఉండడం లేదు. చిక్కటి మజ్జిగ పోసుకునే యోగంలేదు. ఒక పాడిపశువుంటే ఈ బాధ తప్పుతుంది. డాక్టరు దగ్గరకెళ్ళి తన భార్య అనారోగ్య లక్షణాలు చెప్పాడు. డాక్టరు మందుల ప్రిస్క్రిప్షను రాసి ఇస్తూ “మరేం భయంలేదు ఈ మందులు వాడండి. వారానికి రెండు ఇంజక్షన్లు ఇస్తాను. ఆమెను తీసుకురండి, నెలరోజుల్లో ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది” అని హామీ ఇచ్చాడు.

“అమ్మమ్మ! ఎంత మాట! మందు చీటి కాదు నాకు కావలసింది. ఆరోగ్యం సరిగాలేదు అన్న సర్టిఫికేటు” అంటూ పది కాగితం ఇచ్చాడు డాక్టరుకు. రోగం ఇప్పుడు అర్థమైంది. రాసిన చీటి చింపేసి మరోటి రాశాడు. గౌరీపతి అప్లికేషనుకి ఆ చీటి జతచేసి ఆఫీసులో సి.డి.ఎస్.కోసం ఓ అర్జీ పెట్టుకున్నాడు. ఆర్జీ ఎగిరిపోకుండా దాని మీద ఒక అయిదు కాగితం బరువుగా ఉంచాడు. వారం తిరక్కుండా పది వందలు దొరికాయి.

మాటల ప్రస్తావనలో ఆదెమ్మ గేదెను అమ్ముతున్న వైనం తెలిసింది. ఏడు వందలు పోసి గేదెను తెచ్చుకున్నాడు. పూటకు సేరు పాలిస్తుంది. రోజూ పాలూ పెరుగూ వెన్న తీసి నెయ్యి కూడా చేసుకుంటున్నారు. గౌరీపతి భార్య ఇప్పుడు ఒళ్లు చేసింది.

మొదటినుండి ఆదెమ్మ గేదె దొంగ తిండికి అలవాటుపడింది. గుంజకు కట్టి ఎంత దాణా వేసినా, రాత్రి ఏ పాదో మొక్కో తింటేనే కాని దానికి తిన్నట్టు ఉండదు. గేటు అడ్డు ఇప్పుడు లేదు. లక్ష్మీపతి పెరడు రెండు రోజుల్లో గౌరీపతి పెరడు స్థితికి వచ్చింది. లక్ష్మీపతి కుటుంబం అలోపాలోమన్నారు. ఇలా చూస్తూ వూరుకోవడం సాధ్యంకాలేదు. దెబ్బలాడి ఫలితంలేదు. భార్యతో సంప్రదించిన మీదట మొండివాడితో వాదన దేనికి అనుకున్నాడు. అయితే దీనికో పరిష్కారం కావాలి. గౌరీపతికి బుద్ధిరావాలి. రాత్రల్లా జాగారం చేశాడు. తెల్లవారుజాము మూడు గంటలకు గేదె లక్ష్మీపతి ఆవరణలోకి అల్లుడి హోదాలో ప్రవేశించింది.

మరునాడు ఉదయం పాలుతీయబోతే గేదె వెనక్కాళ్ళతో గౌరీపతి ముఖంమీద తన్నింది.

గౌరీపతి డిస్పెన్సరీకి పరుగెట్టాడు.

"మరో సర్టిఫికెటు కావాలా?" అన్నాడు డాక్టరు.

"కాదు. మందే కావాలి" గేదె తన్నిన వైనం చెప్పాడు.

లక్ష్మీపతి పడుకునే ముందు రెండున్నరకు అలారం పెడుతున్నాడు.

గౌరీపతిని గేదె తన్నుతూనే ఉంది.

ఈ క్రమం ఇలా నడుస్తూనే ఉంది.

వారం రోజులై గౌరీపతి ఆదెమ్మ నీళ్ళపాలు ఉదయం పోయించుకుంటున్నాడు. లక్ష్మీపతి ఇంటినుంచి రోజూ పాలతో చేసిన పదార్థం పోరటిగా గౌరీపతి ఇంటికి వస్తున్నది. గౌరీపతికి ఇది సహించరానిదైంది.

ఇందులో ఏదో చిత్రం ఉంది. ఏదో మోసం ఉంది. లక్ష్మీపతికి పాలెక్కడివి?

రాత్రి డ్యూటీకి వెళ్లాడే కాని మనసు పనిమీద లగ్నం కాలేదు. పంటినొప్పి వంకతో రాత్రి మూడు గంటల ప్రాంతంలో ఇల్లు చేరుకున్నాడు. లక్ష్మీపతి పెరటి వేపు నుంచి పాలు పిండుతున్న సవ్వడి, తన ఆవరణలో గేదె లేదు. పరిస్థితి అర్థమైంది. 'సొమ్మొకడిది, సోకొకడిది' కోపాన్ని పట్టలేక పోయాడు.

"మా గేదె పాలు పిండుకోవడం న్యాయమా?"

"మా మొక్కలు మీ గేదె తినడం న్యాయమా?"

గొడ్డుమనిషిలా ప్రవర్తించగలదా? దానికి తన - పర అని ఏం తెలుసు? గడ్డి కనిపిస్తే తిని ఉంటుంది. అంతమాత్రాన గేదెపాలు అపరాత్రి దొంగతనం చేస్తావా?

"గొడ్డు మనిషిలా ప్రవర్తించదు. అయితే మనిషి గొడ్డులా ప్రవర్తించాలా? గేదెను కొనగానే సరికాదు. ఆ గేదె ఇతరులకు హాని చేయకుండా చూడాలని నీకు తెలియదా? మనిషికోమాట - గొడ్డుకో దెబ్బ అంటారు. నీకు ఎన్నిమార్లు చెప్పినా, దాన్ని ఎన్నిమార్లు బాదినా బుద్ధిరాలేదు. అందుకే ఇలా చేయవలసి వచ్చింది" అన్నాడు లక్ష్మీపతి.

వీరి దెబ్బలాటలో ఆ ఇళ్ళవాళ్ళే కాదు పొరుగువాళ్ళూ వచ్చారు.

గౌరీపతికి కోపం ఆగలేదు. లక్ష్మీపతి తుంటిమీద కొట్టాడు.

టార్చిలైటు వెలిగించి బుడుగు నేల మీద ఏదో వెతుకుతున్నాడు. అందరి దృష్టి వాడిమీద పడింది. "ఒరే! నువ్విలా రా!" అన్నాడు బుడుగు తండ్రి.

"ఆ! ఇదిగో దొరికింది" బుడుగు ఆశ్చర్యంగా అరిచాడు.

అందరూ ఆశ్చర్యపోయారు.

"వేపపండు"

"వేపపండు దొరకడమేమిటిరా! వెర్రి వెధవా! నువ్విలా రా" అంటూ చెవి పట్టుకు లాగాడు బుడుగు తండ్రి.

"నువ్వే చెప్పావుగా తుంటిమీద కొడితే మూతి పళ్ళు రాలతాయని. వేప్పళ్ళా!?...."

"నోరు ముయ్యి! అది సామెత! రాలేవి మూతి పళ్ళు - వేపపళ్ళు కావు."

అలాగా తుంటిని కొడితే ఎవరివి రాలతాయి? కొట్టినవాడివా? లేక దెబ్బతిన్నవాడివా అని అడగాలనుకున్నాడు. తండ్రి చేతిలో చెవి చిక్కడం వలన నోరు పెగలలేదు.

"మామయ్యా! మా నాన్నతో మీరేమిటి? మీరు ఇంట్లోకి పదండి" ఒక అర్ధనారీశ్వరుడి కంఠం వినిపించింది.

అర్ధనారీశ్వరుని కంఠం ఎక్కడిదా అని ఆశ్చర్యపోకండి. ఆ వంతు నాదైంది. తీరా చూస్తే అది అర్ధనారీశ్వరుడి కంఠం కాదని తెలిసింది. గౌరీపతి గారి అమ్మాయి, లక్ష్మీపతిగారి అబ్బాయి జాయింటుగా అనడం వలన అర్ధనారీశ్వరుడి కంఠం అని భ్రమపడ్డాను.

'వీడి అంతు నేను చూస్తాను' అంటూ గౌరీపతి, డిటో ముక్కలే అంటూ లక్ష్మీపతి తమ తమ వాటాల లోనికి వెళ్ళిపోయారు.

'అయ్యో! పాలన్నీ నేలపాలయ్యాయి' అని వాపోయారు ఒకరిద్దరు. నీళ్ళపాలు తెలుసును కాని ఈ నేలపాలేమిటో బుడుగుకి తెలియక తలగోక్కోబోయి తన చెవి పట్టుకున్న తండ్రి చెయ్యి గోకాడు.

రాజీ కుదరడానికి రాధాగోపాలం కారణభూతులయ్యారు.

రాధ ఎవరు? గోపాలం ఎవరు??

గౌరీపతి ఏకైక పుత్రిక, లక్ష్మీపతి ఏకైక పుత్రుడు రాధాగోపాలం - వరుసగా.

లక్ష్మీపతి భార్యకు గౌరీపతి భార్యకు వియ్యమందాలని ఉంది. కొంతకాలంగా ఇద్దరు పిల్లలూ ముచ్చట పడుతున్నారు. ఆడవాళ్ళు తలచుకుంటే చేయలేనిదేముంది? అందులోనూ అవసరం గౌరీపతిది. శత్రువుని మిత్రునిగా చేసుకోవాలంటే ప్రతిపక్షం వాడికి మంత్రిపదవి ఇచ్చి తనపక్షం చేసుకున్నట్లు ఏదో ఒకటి ఇవ్వాలి.

గౌరీపతికి లక్ష్మీపతికి మొదటినుంచి ఈ వియ్యం ఇష్టంలేదు. చెప్పుకోదగ్గ కారణం వాళ్ళ మధ్య వైరమే. రూలింగు పార్టీలోని సభ్యులు ప్రతిపక్షంలో కలిసిపోతే ప్రభుత్వం పడిపోక ఏమవుతుంది. తమ భార్యలే తమకు ప్రతికూలిస్తే వారు చేసేది ఏముంది? తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి వాళ్ళ ముద్దు చెల్లించాలి.

అంతే చేశారు. ఆదెమ్మ గేదె కట్నరూపంలో లక్ష్మీపతికి గౌరీపతి ఇవ్వడానికి భార్య కోరికమీద అంగీకరించాడు.

గౌరీపతి పుత్రికను లక్ష్మీపతి పుత్రుడికిచ్చి వివాహం చేసి వైరానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని వారు ఒక ఒడంబడికకు వచ్చారు.

బద్ధవిరోధులు జంటగా కూర్చుని ఎవరెవరికి శుభలేఖలు పంపాలో అని లిస్టు రాసుకుంటున్నారు.

(ఆంధ్రప్రభ - సచిత్ర వారపత్రిక **28.11.1979**)